120

# కన్ని

కురూపియైన ముష్టిబాలికను కొంచెం కరుణతో చూచి, ఎవరైనా గుప్పెడు గింజలుగాని, ఒక రాగిపైసగాని, మొహం అవతల తిప్పైనా, విసిరేస్తారు.

కొంచెం కనుముక్కు తీరు సరిగావున్న అమ్మాయి, యవ్వనంలో వుండి బాబూ! ఇవ్వాళ పొద్దుపొడిచిన దగ్గిర నుంచి ఒక్క పిడచైనా లేక మలమల మాడిపోతున్నాను. ఏమైనా ఇవ్వండి రాజా!' అంటే, 'ఛీ! నోరుముయ్. పోతరించుకున్నావ్, ఇంత పనీపాటా చేసి నాలుగురాళ్ళు సంపాదించుకోకూడదూ?' అంటాడా మహారాజు.

అంతపనీ అయింది కన్నికి. రాయలసీమలో తిండి సరిగా వుందనా? పరువుగల కుటుంబాలే, దూరాన్ని గంజి చూచుకొని బ్రతుకుతున్నారు. అన్నమోరామచంద్రా! అంటే అన్నమోరామచంద్రా! అని వానలరూపం మరిచిపోయిన పొలాలు కాని ఆ యెడార్లు ప్రతిధ్వనిస్తాయి. చెరువులవైపు చూసి పొలాలు, పొలాలవైపు చూసి చెరువులూ కంటతడి బెట్టటానికైనా నీళ్ళులేక, వేడినిట్టూర్పులు విడుస్తాయి. మొక్కబళ్ళకైనా ఒక్క పువ్వు పూయని యెండినచెట్లు, కొట్టి కడుపులో మంట చేసుకొనేందుకే పనికివస్తాయేమో!

## 2

కుటుంబాన్ని పోషించేభారం కన్నమ్మమీదే పడింది. గుత్తిస్టేషను వెనకపక్క ప్లాటుఫారంమీద నుంచుని, రైలు పొడుగునా తిరుగుతూ ముష్టెత్తుకొనే కన్నికి పైసలు, అణాలు

కాకాసులు, ఒక్కొక్కప్పుడు పావలా-కాసులు కురిపించిన రైళ్ళ పెట్టెలన్నీ నిండివుండే సిపాయివీరులు. డబ్బులు వేస్తూ వినరాని కూతలు కూసేవారు. పళ్ళు పుచ్చుకుని ఆమె రొమ్ముమీద పొత్తికడుపుమీద విసిరికొడుతూ హేళనచేసేవారు. కన్నితోపాటు ముష్టెత్తుకుంటూ తిరిగే పెంచెలమ్మి కన్నికన్న ఎక్కువదుడ్డు సంపాదించేది. కాంక్షలతో చూడని మర్యాదను నిలువునా సంపాదించేది. సిపాయీల అసభ్యపు అసహ్యపు మర్యాదను భరించలేక కన్ని రైలుదగ్గిర ముష్టెత్తడం మానింది.

## 3

ఇన్నాళ్లూ ఖర్చుపోను ముష్టివల్ల కూడబెట్టి సంపాదించిన యిరవైరూపాయిలూ రెణ్ణెల్లలో అయిపోయాయి. కాని కన్ని ఒక తెల్లని పెద్ద వెండినాణాన్ని మాత్రం అతి రహస్యంగా ఓ చోట దాచుకుని పైకి తీసేదికాదు. ఆ నాణెము అమెరికా డాలరు వెండినాణెము. అది తనకిచ్చింది ఒక సిపాయి. మూడువందల జన్మలెత్తినా కన్ని ఆ సిపాయిని మఱచిపోలేదు. ఎంత పొడుగ్గా వున్నాడా కుఱ్ఱవాడు!! ఒక రోజున బొంబాయి యెక్సుప్రెస్సు గుత్తిస్టేషనులో చాలాసేపాగింది. యథాప్రకారం సిపాయిలందరూ తన డబ్బాబ వేశారు. పళ్లూ గిరవాటు వేశారు. నానురొట్టె లుచ్చుకు కొట్టారు. ఇంతలో ఓ సింహంలా ఆ మదరాసు నాయళ్ళబ్బాయి ఊరకుక్కలు అల్లరిపెట్టే ఆవుదూడ దగ్గరకు వచ్చే మాతలా వచ్చాడు.

"నీ పేరేవరు?"

"కన్నె అంటారుసామీ!"

"ఇదిగో కన్నీ! నీకుదా ఈ ముష్టి ఎందుకు?"

"చక్కని నీ మొగంలో విషాదం కురవబోయే...ఏ... మొయిల్లావుంది. నాన్దా మద్రాసు నాయిళ్ళకుర్రాణ్ణి. ఆఫ్రికాలో జర్మనువాణ్ని చావకొట్టి అలసటపడి ఇంటికి నెల రోజులు సెలవుమీదదా వస్తుంటిని. ఆ యుద్ధములో ఒకఅమెరికా సైనికుణ్నిదా, నాన్దా రక్షిస్తిని. వాడిదేశంనాణెందా ఇది. బహుమతి ఇచ్చినాడు. ఇది నీదగ్గిర గుర్తుగావుంచుకో, ఈ దుడ్డుతీసికొని రేపణ్నించి ముష్టిదా మానెయ్యా" అని తనచేతిలో ఇన్ని రూపాయినోట్లు, ఒక డాలర్ నాణెము పెట్టి కదలబోతూన్న రైలెక్కి మాయమైపోయాడు.

## 4

ఆ మర్నాడునుంచి కన్ని ముష్టిమానింది. తమపశుత్వ ఆకలిని తీర్చుకోడానికి ఆ బాలికను తమ పక్కలపైకి రమ్మని పలువురు ఆశించారు. పలువురు కన్నులతో కబళించారు. ఆరు కడుపులున్న తనకుటుంబాన్ని రక్షించుకోడానికి ఆవిధంగా ధనం సంపాదించే సులభమార్గాన్ని కన్ని మైలుదూరమైనా రానిచ్చిందికాదు. రహస్యంగా దాచుకున్న ఆ డాలరునాణెం కన్నుల కద్దుకొనేది.

"ఏదారి వచ్చావో?
ఏదారి పోయావో
నీదారి నీదిరా!
నాకు దారే లేదురా"

గొణుగుకొనేది. అప్పటికి మూడురోజులనుంచి ఆ ంబానికి తిండిలేదు. తల్లీ తండ్రీ అందరూ "మాయ ౦డకు మానాభిమానా లొచ్చాయంట" అని తిట్టారు. తిండిలేక నీరసపడిపోయిన కన్ని కదలదు. రైళ్ళువస్తున్నాయి పోతున్నాయి. ఊళ్ళోవున్న బస్సుడ్రైవర్లు, మంగలిషాపు వాళ్ళు, హోటలుపనివాళ్లు, ఈ చిక్కిపోయిన బక్కముండ ఎవరిక్కావాలి? అని చక్కాపోయారు. వారిక్కావలసినా, కన్ని సిద్ధంగావుందా? దెబ్బతిని చచ్చిపోయే పెద్దపులిలా వాళ్ళని చీల్చి చెండాడి, చచ్చిపోయివుండును కన్ని. ఆ రాత్రల్లా వారున్న గుడెసెప్రక్క అతి ఆకలిమత్తులో చావు బ్రతుకులసంధ్యలో సర్వప్రపంచమూ మరచి పడివుందికన్నె. తెల్లవారుతూంది. "కన్నె ఎక్కడా?" అని ఒక గంభీర కంఠం వినబడింది. అంతటి శల్యావశిష్టావస్థలోనుంచి, కోటి ఆనందాలతో ఆ కంఠం ఆనమాలుపట్టిన కన్నె 'ఇక్కడే వున్నాను నాయుడుబావా!' అని కాకలీస్వనంతో జవా బిచ్చింది. ఒక్కఛంగున రామస్వామినాయుడు ఆ బాలిక దగ్గిరకు ఉరికాడు. ఎముకల పోగైన కన్నెను తనహృదయాని కదుముకొన్నాడు. ఆ కౌగిలింత సంజీవి. అతని హృదయము సంజీవిపర్వతము.

## 5

రామిస్వామినాయుడు వాళ్ళింట్లో పదిరోజులున్నాడు. ఊళ్ళో చిన్నయిల్లు అద్దెకుతీసుకొని అక్కడ ప్రవేశపెట్టిం చాడు. నీళ్లు పోయగా పసిమిపొంది మిలమిలలాడి జాజి ట్టులా కన్ని వెనకటి అందంఅంతా తెచ్చుకుంది.

"చిన్నతనాన్నుంచీ బస్సులదగ్గిరదా ముష్టి కన్నీ! అటునుంచి నేనూ ఇక్కడ నువ్వూ నదుల్లా కేట రైలునుంచి చూచిన నాకు, నువ్వు ఏనాడో తప్పిపోయి నేస్తురాలివిదా కనిపిస్తివి."

రామస్వామి కన్నెకు అందాలమెడచుట్టూ మూడు ముళ్లూ వేసినాడు. మఱి పదిరోజులికి రామస్వామి యుద్ధానికి వెళ్ళిపోయినాడు. దేవుడైన తన రామస్వామిని తలుచుకుంటూ నెల నెలకూ ఆతడు పంపించే ఐశ్వర్యంతో కుటుంబాన్ని రక్షించుకుంటూ ఆతడుతప్ప ఇతరమేలేని అతనికోరకై పదిదినాలకిందటివరకూ కన్ని కనిపెట్టుకోనేవుంది.

"ఇటలీయుద్ధము నెగ్గాము. నాకుడిచేయి ఇటలీకి అర్పించాడు. కాని ఆరోగ్యము మహా సముద్రంలావుంది. నిన్ను గట్టిగా కౌగిలించుకోనేందుకు ఒకచేయలేదు కన్నీ!" అని రామస్వామి కెలిగ్రాము. నా ప్రాణమేఅయిన నా సామికి నేను ఒకచేయికాలేనా! అని కన్ని అనుకుంది.